# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 309 | పేజీలు: 5 | వెల: రూ.3/- | మంగళవారం 17 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




## చంద్రబాబుతో తుమ్మల భేటీ

**ఆ గ్రామాలను తెలంగాణలో కలపాలి**

**ఇద్దరి భేటీ రాజకీయంగా చర్చ**

**చంద్రబాబును కోరిన టీ. మంత్రి తుమ్మల**

**ఇద్దరి భేటీ రాజకీయంగా చర్చ**

**అమరావతి, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అమరావతిలో సమావేశం అయ్యారు. ఈభేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా పునర్విభజనలో ఆంధ్రాలో కలిసిన 5 గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడానికి సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. తిరుమలలో తెలంగాణకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం చంద్రబాబుని తుమ్మల కోరారు. ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించాలని సీఎం చంద్రబాబును మంత్రి తుమ్మల కోరారు. ఖమ్మం జిల్లా పెద్దవాగు మరమ్మత్తుల కోసం అయ్యే ఖర్చులో 85శాతం నిధులను విడుదల చేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా సత్తుపల్లి, కొవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి, అమరావతి రైల్వేలైన్ నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించారు.

# పురపాలికల్లో పై'చేయి'

## 84 స్థానాల్లో కాంగ్రెస్ హవా



**రాష్ట్రంలో 105 మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తి**

**మరో 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా**

**చైర్మన్ ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 84 కాంగ్రెస్ కైవసం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

పురపీఠాలపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. 116 మున్సిపాలిటీల్లో 11చోట్ల చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఎన్నికలు వాయిదా పడగా 84 చోట్ల పీఠాల్ని కైవసం చేసుకుంది. పూర్తి ఆధిక్యం ఉన్న పట్టణాల్లో ఏకపక్షంగా పురపాలికల్ని చేజిక్కించుకోగా బలం లేనిచోట ఎంఐఎం, ఇండిపెండెంట్లు, ఎక్స్అఫిషియో అస్త్రంతో మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకుంది. బీఆర్ఎస్ 17 పురపాలికల్ని దక్కించుకోగా బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీతో సరిపెట్టుకుంది. బీజేపీ మినహా ప్రధాన పార్టీల మద్దతుతో భైంసా, ఆదిలాబాద్ పీఠాల్ని ఇండిపెండెంట్లు కైవసం చేసుకున్నారు. పార్టీల ఎత్తుకు పైఎత్తులతో అనేక మున్సిపాలిటీల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా : పురపాలక ఎన్నికల ఫలితాల్లో మెజార్టీ వార్డుల్ని కైవసం చేసుకుని సత్తా చాటిన కాంగ్రెస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎన్నికలోనూ హవా కొనసాగించింది. 116 మున్సిపాలిటీలకు గానూ 11 పురపాలికల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడగా మిగిలిన వాటిలో 84 పీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎంఐఎం, ఎక్స్అఫీషియో ఓటు సహా స్వతంత్రుల బలంతో పట్టణాలపై కాంగ్రెస్ జెండా ..మిగతా 2లో

# అమరావతి పర్యటనలో బిల్ గేట్స్



**డిజిటల్ పాలనపై ప్రశంసలు**

**ఆర్టీజీఎస్, డేటా మేనేజ్ మెంట్ పరిశీలన**

**కీలక ప్రాజెక్టుల ప్రజంటేషన్‌ల పట్ల ఆసక్తి**

**ప్రభుత్వ విధానాలను వివరించిన చంద్రబాబు**

**అమరావతి ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో పలు ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. బిల్ గేట్స్ సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయం నుండి నేరుగా ఆయన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రాన్ని సందర్శించారు. ఆర్టీజీఎస్ ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న రియల్ టైమ్ మానిటరింగ్, డేటా మేనేజ్‌మెంట్ , పౌర సేవల ..మిగతా 2లో

## రాజకీయాల్లోకి నన్ను లాగొద్దు

**సంబంధం లేని అంశాల్లోకి నెట్టొద్దు**

**హీరోయిన్ త్రిష ఆగ్రహం**

**సారీ చెప్పిన తమిళనాడు బీజేపీ చీఫ్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

కోలీవుడ్ స్టార్, టీవీకే అధినేత విజయ్‌పై తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ రీసెంట్‌గా తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోకి హీరోయిన్ త్రిషను తీసుకురావడంతో వివాదం నెలకొంది. ఆయన కామెంట్స్‌ను సోషల్ మీడియా వేదికగా తప్పుబట్టారు. విజయ్‌పై విమర్శలు చేసే క్రమంలో తన పేరు తీసుకు రావడంపై త్రిష స్పందించారు. ఈ క్రమంలో ఆమె తరఫు లాయర్ ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ఈ నోట్‌ను ..మిగతా 2లో

# జెండా పీకేసిన జేడీ

**రాజకీయాలకు వి.వి. లక్ష్మీనారాయణ స్వస్తి**

**మెఘా గ్రూపులో కీలక బాధ్యతల్లో ఉద్యోగిగా చేరిక**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ.. తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారుండరు. అవినీతి తిమింగలాల గుండెల్లో నిద్రపోయిన అధికారిగా, అచంచలమైన నిజాయితీకి మారుపేరుగా ఆయన నిలిచారు. అయితే, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ఐపీఎస్ పదవిని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ మిస్టర్ క్లీన్, ఇప్పుడు అనూహ్యంగా అన్నింటినీ వదిలేశారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరిపోయారు. నిజానికి ఆయన అన్ని బాధ్యతలను పూర్తి చేసుకుని తన అభిరుచి మేరకు రాజకీయ, సేవా రంగంలోకి వచ్చారు. కానీ ఇప్పుడు ఎందుకు మళ్లీ ఉద్యోగ బాధ్యతల్లోకి వెళ్లారు? అన్నది చర్చానీయాంశంగా మారింది. ఇటీవల ఆయన కుటుంబం సైబర్ మోసగాళ్ల బారిన పడింది. రెండున్నర కోట్ల వరకూ నష్టపోయారు.తన సుదీర్ఘ సర్వీసులో కష్టపడి సంపాదించుకున్న డబ్బంతా ఒకే ఒక్క సైబర్ మోసంతో ఆవిరైపోవడం ఆయనను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందన్న అభిప్రాయం కనిపిస్తోంది. రాజకీయాల్లోకి రాకముందే తనదైన ముద్ర వేసిన లక్ష్మీనారాయణ, 2019 నుంచి



ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా రైతులు, యువతకు అండగా నిలిచారు. తన నిజాయితీతో కూడబెట్టిన సంపాదన అంతా కళ్లముందే మాయమైపోవడంతో ఆయనకు ఆర్థిక కష్టాలు చుట్టుముట్టినట్లుగాభావిస్తున్నారు. రాజకీయాల్లో ఓటమి ..మిగతా 3లో



## కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

**అధికారులకు సిఎస్ ఆదేశాలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం ..మిగతా 2లో

# పురపాలికల్లో పై'చేయి'



మొదటి పేజీ తరువాయి...

ఎగురవేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో తిరుమలగిరి మినహా అన్ని పురపీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 పురపాలికల్ని హస్తగతం చేసుకుంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10 మున్సిపాలిటీల్ని దక్కించుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5 మున్సిపాలిటీల్ని చేజిక్కుంది. 2చోట్ల కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడింటికి ఏడు మున్సిపాలిటీల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 9 పురపాలికల్ని దక్కించుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 10 పురపీఠాల్ని చేజిక్కించుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏడింటికి ఏడు పురపాలికల్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరింటిలో పాగా వేసింది.

17 మున్సిపాలను దక్కించుకున్న బీఆర్ఎస్ : బీఆర్ఎస్ 17 పుర పీఠాల్ని దక్కించుకుంది. గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, జిన్నారం, ఆలంపూర్, అయిజ, మూడు చింతలపల్లి, ఎల్లంపేట, దుబ్బాక, రాయికల్, ఆసిఫాబాద్, తిరుమలగిరి, గజ్వేల్, చేర్యాల, జమ్మికుంట, సిరిసిల్ల, తూప్రాన్ పురపాలికల్లో గులాబీ జెండా ఎగురవేసింది. బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీని దక్కించుకోగా ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ వడ్డేపల్లి మున్సిపాలిటీని చేజిక్కించుకుంది. పార్టీల మద్దతుతో భైంసా, ఆదిలాబాద్ పురపాలికను స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. అంతకుముందు పాలకవర్గాలు కొలువుదీరడంతో కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.


నాటకీయ పరిణామాల మధ్య ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు పురపాలికల్లో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. తొర్రూరు మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల తోపులాట జరిగింది. దీంతో పోలీసులు ఇరువర్గాల నేతలను అడ్డుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి పీఏపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ వద్ద పోటాపోటీగా నినాదాలు చేశారు.

సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో రసాభాస నెలకొంది. సిరిసిల్ల వైస్‌ఛైర్మన్‌గా బుర్రా నారాయణ పేరును మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. సీల్డ్ కవర్‌లో బుర్రా నారాయణ పేరు లేకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహానికి గురయ్యారు. సీల్డ్‌కవర్‌లో ఛైర్మన్‌గా కళాచక్రపాణి, వైస్‌ఛైర్మన్‌గా సందీప్ పేర్లు ఉన్నట్లు సమాచారం అందడంతో శ్రేణులు ఆందోళనకు దిగాయి.

11 మున్సిపాలిటీలు వాయిదా : పలు కారణాల వల్ల ఈరోజు 11 మున్సిపాలిటీల్లో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ల ఎన్నిక వాయిదా పడింది. ఇందులో ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు పట్టణాలు ఉన్నాయి. పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.

# గద్వాల మున్సిపల్ ఛైర్మన్‌గా తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వైస్ ఛైర్మన్‌గా ఎండి బాబర్






## ప్రశాంతంగా గద్వాల పురపాలక చైర్పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక.

## ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వినియోగించుకున్న ఎంపీ మల్లు రవి

## ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం)**

గద్వాల పురపాలక సంఘం చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు తెలిపారు.సోమవారం గద్వాల పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి 37 వార్డుల సభ్యులుగా ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎన్నికైన సభ్యులతో అదనపు కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 33వ వార్డు నుంచి కౌన్సిలర్ గా ఎన్నికైన జయలక్ష్మిని చైర్ పర్సన్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున 35వ వార్డు నుంచి ఎన్నికైన ఎండి బాబర్ ప్రతిపాదించగా, 28వ వార్డు నుంచి కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ బలపరిచారు. బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి 23వ వార్డు సభ్యురాలిగా గెలుపొందిన అనిత కుమారిని అదే పార్టీ నుంచి ఏడవ వార్డు సభ్యుడిగా గెలుపొందిన జగదీష్ చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించగా, 20వ వార్డు సభ్యులు నరసింహులు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. చేతులెత్తే విధానంలో ఇరు పార్టీల నుంచి చైర్పర్సన్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో మొదట అనిత కుమారికి చేతులెత్తే విధానంలో ఓటు వేయాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు కోరారు. బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన 11మంది సభ్యులు అనిత కుమారికి మద్దతుగా చేతులెత్తే విధానం ద్వారా మద్దతు ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తరపున చైర్పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జయలక్ష్మికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 16 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన ఇరువురు, ఎంఐఎం నుంచి గెలుపొందిన ఒకరు మొత్తం 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి చెయ్యి ఎత్తు విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 20 మంది మద్దతు ఉండడంతో జయలక్ష్మిని గద్వాల పురపాలక సంఘం చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రమే విప్ జారీ చేయడం జరిగిందని, ఇతర పార్టీల నుంచి విప్ జారీ చేయబడలేదని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నర్సింగరావు పేర్కొన్నారు.అనంతరం వైస్ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ నుంచి 14వ వార్డు సభ్యుడు శంకర్ ను 9వ వార్డు నుంచి కాంగ్రెస్ సభ్యులుగా గెలుపొందిన రామలింగేశ్వర కామ్లే ప్రతిపాదించగా, 3వ వార్డు నుంచి అదే పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన నాగులు బలపరిచారు. బిఆర్ఎస్ పార్టీ వైస్ చైర్మన్ అభ్యర్థిగా 21 వార్డు నుంచి గెలుపొందిన పులిపాటి వెంకటేష్ ను 20వ వార్డు సభ్యులు నరసింహులు ప్రతిపాదించగా, ఐదవ వార్డ్ సభ్యులు చిన్నసంటన్న బలపరిచారు. మొదట పులిపాటి వెంకటేశు కు చేతులెత్తే విధానంలో ఓటు వేయాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు కోరగా 11 మంది సభ్యులు అతనికి మద్దతు పలికారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన శంకర్ కు 16 మంది కాంగ్రెస్ సభ్యులతోపాటు, స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన ఇరువురు, ఎంఐఎం నుంచి గెలుపొందిన ఒకరు మొత్తం 19 మంది కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 20 మంది మద్దతు ఉండడంతో శంకర్ ను వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రకటించారు. అనంతరం చైర్పర్సన్ గా ఎన్నికైన జయలక్ష్మి తో, వైస్ చైర్మన్ గా ఎన్నికైన శంకర్ తో అదనపు కలెక్టర్ నర్సింగరావు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, ఇతర ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








# రాజకీయాల్లోకి నన్ను లాగొద్దు

మొదటి పేజీ తరువాయి...

ఆమె తన ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేశారు. తన క్లయింట్ త్రిష సూచనల మేరకు అంటూ ఆమె అడ్వకేట్ ఈ నోట్ రిలీజ్ చేశారు. 'పాలిటిక్స్‌లో ఉన్నత హోదాలో ఉన్న ఓ వ్యక్తి ఇలా మాట్లాడతారని నా క్లయింట్ అస్సలు ఊహించలేదు. ఆమెకు పాలిటిక్స్‌తో ఎలాంటి సంబంధం లేదు. పొలిటికల్ పార్టీల విషయంలో ఆమె ఎప్పుడూ తటస్థంగానే ఉన్నారు. కేవలం యాక్టింగ్ ద్వారానే త్రిష తానేంటో ప్రూవ్ చేసుకోవాలని అనుకున్నారు. అంతే తప్ప ఇలాంటి పొలిటికల్ కామెంట్స్ వల్ల కాదు. సంబంధం లేని విషయాల్లోకి ఆమెను లాగొద్దు.' అంటూ నోట్‌లో పేర్కొన్నారు. 'ఎంజీఆర్ ప్రారంభించిన అన్నాడీఎంకేలో పళనిసామి, అన్నాదురై ప్రారంభించిన డీఎంకేలో స్టాలిన్ ఉన్నారు. నాలా సొంతంగా పార్టీ ప్రారంభించి ఎన్నికల్లో పోటీ చేయగలరా? అని విజయ్ సవాల్ విసిరారు కదా. మీరేమంటారు?' అంటూ రీసెంట్‌గా నయినార్ నాగేంద్రన్‌ను అడగ్గా... 'పాపం ఆయనకు అనుభవం లేదు.

ముందుగా త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు వచ్చి తన కుటుంబంతో అనుబంధాన్ని కలిగి ఉండాలి.' అంటూ కామెంట్స్ చేశారు. దీనిపై టీవీకే నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగేంద్రన్ ఇలా మాట్లాడడం సరికాదని అన్నారు. అటు సోషల్ మీడియాలో నాగేంద్రన్ కామెంట్స్‌పై విమర్శలు వచ్చాయి. తాజాగా ఈ వివాదంపై నయినార్ నాగేంద్రన్ సారీ చెప్పారు. ఎవరి మనసును బాధ పెట్టే ఉద్దేశం తనకు లేదని... పొరపాటున ఆ కామెంట్స్ చేసినట్లు తెలిపారు. తాను ఎవరి మనసును బాధ పెట్టకూడదని అనుకుంటానని... ఆ వ్యాఖ్యలు చేసినందుకు చింతిస్తున్నట్లు చెప్పారు. తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ వివాదానికి చెక్ పడనున్నట్లు తెలుస్తోంది.



# మార్కెట్‌లోకి రష్యా బంగారం

## గోల్డ్ దిగివస్తుందా..!?

## రూ.లక్ష దిగువకు తగ్గే ఛాన్స్

## అంతర్జాతీయ మార్కెట్ పై తీవ్ర ప్రభావం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా , డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు.

# అమరావతి పర్యటనలో బిల్ గేట్స్

మొదటి పేజీ తరువాయి...

పంపిణీ తీరును ఆయన ఆసక్తిగా గమనించారు. ఆర్టీజీఎస్‌లోని భారీ డిస్ప్లే వాల్స్‌పై ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ టెక్నాలజీ ప్రాజెక్టుల ప్రజెంటేషన్లను బిల్ గేట్స్ చూశారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలను చేరువ చేయడం, అవేర్ 2.0 వ్యవస్థ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీని ఉపయోగించి ల్యాండ్ రికార్డులను భద్రపరుస్తున్న తీరును అధికారులు వివరించారు. ముఖ్యంగా భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ విధానం పారదర్శకతను పెంచుతుందని ఆయన అభినందించారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని హెల్త్ ప్రాజెక్టు ఫలితాలను చూసి దట్స్ నైస్ అంటూ కితాబిచ్చారు. ట్యాక్స్ కలెక్షన్ ప్రక్రియలో డిజిటలైజేషన్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. సచివాలయం సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో బిల్ గేట్స్ ప్రసంగించారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ , సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. డిజిటల్ గవర్నెన్స్ , విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ వాడుతున్న సాంకేతికత ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 రోడ్ మ్యాప్‌ను ఆయన పరిశీలించి, అమరావతి రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందని వ్యాఖ్యానించారు. మధ్యాహ్న భోజనం అనంతరం, బిల్ గేట్స్ ఉండవల్లి పరిసరాల్లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, సాగులో డ్రోన్ల వినియోగం మరియు ఏఐ సాంకేతికతను పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం సుమారు 3:30 గంటల ప్రాంతంలో బిల్ గేట్స్ గన్నవరం విమానాశ్రయం నుండి తిరిగి ముంబైకి బయలుదేరి వెళ్లారు. ఏపీ ప్రభుత్వం ,గేట్స్ ఫౌండేషన్ మధ్య కుదిరిన ఈ అవగాహన భవిష్యత్తులో ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో మరిన్ని విప్లవాత్మక మార్పులకు బాటలు వేయనుంది.


# కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

మొదటి పేజీ తరువాయి...

గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్ధవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా మహా శివరాత్రి వేడుకలు, జాగరణ, అన్నదాన కార్యక్రమాలు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


చిన్న అనంతగిరి శివాలయంలో పుష్పాలంకరణ


**బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):**

అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో మహా శివరాత్రి సందర్భంగా సోమవారం దేవాలయ పరిసరాలను ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో పూలతో అలంకరించారు. గణపతి, అంజనేయ స్వామి, పరమ శివుడు, ఉమా మహేశ్వరీ అమ్మవారు, నవ గ్రహ దేవాలయాల ప్రాంగణాలన్ని పుష్పాలంకరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన అన్న దాన కార్యక్రమం లో 40వేల మంది భక్తులు పాల్గొన్నారని ప్రణవ భక్త సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోంౡ నర్సింహ్మా, పుస్తకాల అశోక్ లు తెలిపారు. భానోదయ హై స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాశంబావులు శ్రీ అంజనేయ భజన మండలి, అమడాపూర్ శ్రీ వాగ్దేవి భజన మండలి, శంషాబాద్ నర్మాడ సద్గురు సంకీర్ణన భజన మండలి సభ్యులు ఆదివారం రాత్రి భజనలు చేసి జాగరణ కార్యక్రమాలను నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ పూజలలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన మహా శివరాత్రి వేడకల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరుగకుం డ ప్రణవ భక్త సమాజం ప్రతినిధులు మోంద్ర నర్సింమ్మ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, సనివెల్లి క్రిష్ణ, స్తోత్రభాష్యం హరినాథ్, రావుల గండయ్య, కొండమీది హరినాథ్, ఎన్ మల్లారెడ్డి, కొలన్ సుబాష్ రెడ్డి , ఎం రామేశ్వర్ రావు, ఎం కొమురయ్య, మ్యాడం మధుసూదన్, ఎస్ జయానంద్ రెడ్డి, షాబాద్ విజయ్ కుమార్. ఎస్ మహేశ్వర్ రెడ్డి, ఎం బాలసుబ్రమణ్యం, చెట్టిగారి నరేందర్ రావు, గొరిగె రాజు, నల్లింగ్ రమేశ్, ఆర్ రాజశేఖర్, కాడెం సుధాకర్, సోమారం సురేందర్. యు శ్రీకాంత్, పోతావత్ రమేశ్ నాయక్, బంగి శ్రీనివాస్, తాటి రాజు, పి. బాల్రెడ్డి, కె కిరణ్ చారి, కాకులారం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.





ప్రణవ భక్త సమాజం సభ్యులు


శివ పార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న వేముల రామక్రిష్ణ, వేముల బాలకృష్ణ ల కుటుంబ సభ్యులు


రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం లో అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్


వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్

## జూనియర్ న్యాయవాదిని హత్య చేసిన కేసులో ఏడుగురు రిమాండ్

**బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

తమ అక్కను పెళ్లి చేసుకుని ఆమె కు దూరంగా ఉంటు రెండో పెళ్లి చేసుకోవడమే కాకుండ తరచు బెదిరింపులకు పాల్పడుతున్న బావ ను మరో ఐదుగురు స్నేహితులతో కలసి ఇద్దరు యువకులు దారుణంగా హత్య చేశారు. బావ ను హత్య చేసిన బామ్మర్దులతో పాటు వారికి సహకరించిన మరో ఐదుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు 48 గంటల లోపు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్ కు తరలించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. సులేమాన్ నగర్ కు చెందిన తబస్సుమ్ ఫాతిమా ను 2014 లో అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖదీర్ వివాహం చేసుకున్నాడు. మహ్మద్ ఖదీర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం తో పాటు జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొదటి భార్య ఉండగానే 2025లో మహ్మద్ ఖదీర్ బండ్లగూడ కు చెందిన సమీరా బేగం ను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెను బం డ్లగూడ లో కాపురం పెట్టాడు. తరచు మొదటి భార్యను. ఆమె సోదరులను ఖదీర్ వేదించేవాడు. ఇటీవల కూడా కుటుంబ తగాదాలు, డబ్బుల విషయంలో మహ్మద్ ఖదీర్ కు ఆయన బామ్మరులకు తరచు గొడవలు జరుగుతున్నాయి. అది మనస్సులో పెట్టుకున్న మహ్మద్ ఖదీర్ బామ్మర్దులు మహ్మద్ హనీఫ్ అలియాస్ హనీఫ్ (26), అబ్దుల్ ఖరీమ్ (29) లతో పాటు అతని స్నేహితులు మహ్మద్ అర్షద్(26), మహ్మద్ ముస్తాక్ అలియాస్ ముష (25), అఖిల్ పాష (29), మహ్మద్ అబ్దుల్ ఖరీమ్ (31), షేక్ ఇస్మాయిల్ (27) లు మోటార్ సైకిల్ లపై వీ కేర్ ఆన్ లైన్ సెంటర్ కు వచ్చి అక్కడ ఒంటరిగా ఉన్న మహ్మద్ ఖదీర్ ను కత్తులతో రాడ్ తో దాడి చేసి హత్య చేశారు. మహ్మద్ ఖదీర్ మరణించాడని నిర్ధారిం చుకున్నాక అక్కడి నుంచి పారిపోయారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యక్ష సాక్షులు, క్లూటీమ్ ఆధారాలు, సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులు ఏడుగురిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వారి నుంచి తొమ్మిది మోబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు, రెండు కత్తులు. ఒక ఐరన్ రాడ్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై నిఘా కొనసాగిస్తామని డీసీపీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు లు పాల్గొన్నారు.


సాయి కాలనీ లో డ్రైనేజీ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## సాయి కాలనీలో డ్రైనేజీ పనులను శంకుస్థాపన

**బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

కాటేదాన్ సెక్షన్ జలమండలి కార్యాలయం పరిధిలోని టీఎన్డీవోస్ కాలనీ సాయి కాలనీ లో రూ. 15.34 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పైపు లైన్ పనులకు సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన చేశారు. జలమం డలి ఆధ్వర్యంలో బాప్టిస్ట్ చర్చి సమీపంలో ఈ పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి కాలనీలో డ్రైనేజీ సమస్యలు లేకుండ శాశ్వత పరిష్కారం చూపడమే తమ కర్తవ్యం అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం లో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జలమం డలి అధికారులు సాయి లక్ష్మీ, రేణుక, నాయకులు ఎన్ ధనుంజయ, టి ప్రేంగౌడ్, సోమ శ్రీనివాస్ గుప్తా, మసున వెంకటేశ్, కాశీగారి యాదగిరి, బి గట్టయ్య, బాస శ్రీనివాస్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## జెండా పీకేసిన జేడీ

మొదటి పేజీ తరువాయి...

ఆయనను ఎప్పుడూ కుంగదీయలేదు. రాజకీయాలు కాకపోతే రైతుల కోసం..యువత కోసం పని చేస్తానని ఆయన ప్రత్యేక సంస్థ పెట్టారు. భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం కూడా చేస్తున్నారు. పిల్లలకు మంచి చెప్పాలని ఎవరు పిలిచినా వెళ్లి చెప్పి వస్తారు. అలాంటి ఆయన అన్నీ వదిలేసి ఉద్యోగంలో చేరాలనుకోవడం వెనుక బలమైన కారణం ఉండటం సహజమే. అది ఆర్థిక సంక్షోభం అనే ఎక్కువ మంది భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో సొంత పార్టీ పెట్టి పోటీ చేసినా ఆశించిన ఫలితం రాలేదు. అటు రాజకీయ వైఫల్యం, ఇటు సైబర్ నేరం వల్ల కలిగిన భారీ నష్టం కారణంగా.. తన కుటుంబ బాధ్యతలు మరియు జీవన పోరాటం కోసం ఆయన మళ్లీ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నట్లుగా భావిస్తున్నారు. ఐపీఎస్‌గా ఎన్నికయి పోలీస్ ఆఫీసర్ అయ్యారు కానీ.. ఆయన ఇంజినీరింగ్ చదివారు. మేఘా గ్రూప్, ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించింది. ఆ సంస్థ అనుబంధ కంపెనీ అయిన ఈవీ ట్రాన్స్ లో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టారు. ప్రజా క్షేత్రంలో ఉండి వ్యవస్థను మార్చాలనే గొప్ప ఆశయం ఉన్నప్పటికీ, సైబర్ నేరగాళ్ల కారణంగా ఎదురైన ఆర్థిక విపత్తు ఆయనను అనివార్యంగా మళ్లీ వృత్తిపరమైన కెరీర్ వైపు నడిపించిందని అనుకోవచ్చు.

## నేడు ప్రధాని మోడీతో ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. రేపు మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.


# నేడు రాజేంద్రనగర్, గగన్ పహాడ్, మైలార్దేవ్పల్లి, హిమాయత్ సాగర్‌లలో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్రనగర్/బండ్లగూడ, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. ఐ సి ఏ ఆర్ విద్యుత్ సబ్టేషన్ పరిధిలో ఉదయం 02.30 గంటల నుండి సాయంత్రం 05:30 గంటల వరకు చిన్న నిర్వహణ బలోపేతం పనుల కోసం గ్రీన్ వాక్ ఫీడర్ , ప్రీస్టేజ్ ఫీడర్ పరిధిలలో ప్రెట్టిగే, ఇద్గా ప్రధాన రహదారి, గ్రీన్ వాక్ కు మార్గాలు, మానస వ్యాలీ, రాజేంద్ర నగర్ గ్రామం, మాణిక్యమ్మ కాలనీ, గాంధీ నగర్ , పరిసర ప్రాంతాలు. రాజేంద్రనగర్ ఫీడర్‌లో 10.30 గంటల నుండి 13.30రావీ వరకు చిన్న నిర్వహణ , బలోపేతం పనుల కోసం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.రాజేంద్రనగర్, శాంతినగర్, ఏ ఆర్ ఐ గేట్, హన్మాన్ నగర్. సాయి కృష్ణ కాలనీ, బంగారు మైసమ్మ., పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**మైలార్ దేవుపల్లి లో...,**

మైలార్ దేవ్ పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం నిర్వహణ పనుల కోసం ఎండి పల్లి విద్యుత్ ఫీడర్లలో స్వల్పకాలిక విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుంది. ఫీడర్‌లో పల్లెచెరువు ఫీడర్‌లో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల



వరకు సుభాన్ కాలనీ, ఆయేషా కాలనీ, హషమాబాద్, దస్తగిరి నగర్, తమిళ బస్తీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి ప్రభుత్వం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఎంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్ లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరుమత్ర నిమిత్తం మంగళారం సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి హర్షవర్ధన్ తెలిపారు.గగన్‌పహాడ్ సబ్-స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడం కోసం ఫీడర్‌లపై విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. 10:00 గంటల నుండి 13:00 గంటల వరకు గగన్‌పహాడ్ పారిశ్రామిక ప్రాంతం, గ్రీన్ సిటీ, జల్‌పల్లి, శివాజీ నగర్ మొదలైనవి.మధ్యాహ్నం 2:00 గంటల నుండి. 17:00 గంటల వరకు

సతంరాయ్ గ్రామ ఫీడర్, ప్రభావిత ప్రాంతాలు సతంరాయి గ్రామం, బలహీన వర్గాల కాలనీ, పాశంబండ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్

పి.హర్ష వర్ధన్ ఓ ప్రకటనలు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**హిమాయత్ సాగర్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంచార్జ్ ఇంజనీర్ రమేష్ తెలిపారు.

సెక్షన్ పరిధిలో విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించటం, నిర్వాణ పనుల కోసం ఉదయం 10:00 గంటల నుండి. 13:00 గంటల వరకు అప్ప సబ్-స్టేషన్ నుండి హిమాయత్‌సాగర్ ఫీడర్ ఇమానేటింగ్ పరిధిలో బిపి పెట్రోల్ బంక్ అప్ప జంక్షన్ నుండి , ఐఏఎస్ అన్వర్ హౌస్, ఆర్కే వెంచర్, పెద్దరామయ్య కాలనీ మొదలైనవి,

**అజీజ్ నగర్ ఫీడర్ ఇమానేటింగ్**

గెస్ట్ హౌస్, , రామ్ చరణ్ ఫామ్ హౌస్, హెర్బల్ గార్డెన్, జీవీకే ఫామ్, ఆనంద నిలయం, దర్గా ఫీడర్ 33/11 కె.వి అప్ప సబ్-స్టేషన్ నుండి వెలువడుతున్న హిమాయత్‌సాగర్ గ్రామం, జీవీకే ఫారం, సంధ్యా నిర్మాణాలు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసం, వడ్డెరబస్తీ, మధ్యాలా బస్తీ, కింది., బస్తీ 14:00 గంటల నుండి. నుండి 17:00 గంటల వరకు పీరంచేరు ఫీడర్ స్నేహ హిల్స్ సబ్-స్టేషన్ పరిధిలోని షాదన్ ఇన్‌స్టిట్యూట్స్, పీరంచేరు విలేజ్, వసతి ఆనంది అపార్ట్‌మెంట్స్, ఎంపైర్ ఇన్‌సిగ్నియా విల్లాస్, గిర్ధారి అపార్ట్మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఇన్చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. రమేష్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల ఇంజనీర్లు కోరారు.

# అరాచకాన్ని సృష్టించి అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ

## మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ

### గద్వాల ప్రజల గుండె స్పందనగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు



**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి16(ప్రభాత ఉదయం)**

గద్వాల్ మున్సిపల్ ఎన్నకల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు అరాచకాని సృష్టించి గద్దెనక్కింది అని, బీఆర్ఎస్ పార్టీకీ ప్రజాదరణ ఏ మాత్రం తగ్గలేదనడానికి గద్వాల మున్సిపల్ ఎన్నికలు నిదర్శమని మాజీ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ ఆంజనేయగౌడ్, గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ బాసు హన్మంతునాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. గద్వాల మున్సిపల్ బీఅర్ఎస్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం అధికార కాంగ్రెస్ పార్టీ బీఅర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన 11మంది కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసిన లొంగకుండా సోమవారం గద్వాలలో నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నికల్లో దీ=ూ పార్టీ కౌన్సిలర్లు పోటీ చేసి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి భయపడకుండా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి భయపడకుండా అడ్డు నిలిచిన కౌన్సిలర్ల అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని తెలిపారు. గద్వాలలో ప్రజా బలమున్న నాయకుడని గద్వాల ఎమ్మెల్యే బండ్ల చెప్పుకోవడం సిగ్గుగా ఉందని ఎర్రవల్లి చౌరస్తా నుంచి ఒక డీఎస్పీ స్థాయి అధికారి, ఇద్దరు సిఐలు ప్రోటోకాల్ని వదిలిపెట్టి కౌన్సిలర్ లను తరలించడం సిగ్గు చేటన్నారు పోలీస్ అధికారులు సీఎం స్థాయి ప్రజాప్రతినిధులు ప్రోటాకాల్ నియమాలు పాటించాలి కాని కౌన్సిలర్లను తరలిస్తున్న వాహనాల వెంటా ఉరుక్కుంటూ వెళ్తూ వారిని గద్వాల మున్సిపల్ కార్యాలయంలోపలికి తీసుకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

గద్వాల్ మున్సిపల్ ఎన్నికల్లో 15 పైగా వార్డులను బీఅర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని అన్ని సర్వేల్లో రావడంతో బెంబేలెత్తిపోయిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి 20 రోజుల పాటు వాడవాడలా అరాచకాన్ని సృష్టించి, అధికార బలాన్ని ఉపయోగించి, యంత్రాంగాన్ని ఉపయోగించుకొని, డబ్బులను విచ్చలవిడిగా వాడి, సీడ్, సాండ్ మాఫియాను దింపి అరాచకం సృష్టించి ఎన్నికలను అపహాస్యం చేస్తూ పెద్ద ఎత్తున ఎన్నికల అక్రమాలకు పాల్పడినట్లు ఆంజేనయ గౌడ్ ఆరోపించారు.

అయినా సరే గద్వాల పట్టణ ఓటర్లు ధైర్యంగా ముందుకు వచ్చి అక్రమాలను దేన్నైనా సరే ఎదుర్కొని పెద్ద ఎత్తున బి.ఆర్.ఎస్ పార్టీకి ఓటేసి 11 మందిని వార్డు సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించారని పేర్కొన్నారు. అయితే ఎనిమిదివ వార్డు మెంబర్ జయలక్ష్మీ కోటేష్ గెలుపొందగా ఆర్.ఓ (=ూ) తో ఏక పక్ష నిర్ణయాలతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచినట్లు సంతకం చేయించుకొని ప్రకటించుకున్నారని అరోపించారు. గద్వాల్ మున్సిపల్ కౌంటింగ్ మున్సిపల్ చైర్మన్ గద్దెనెక్కడానికి

కాంగ్రెస్ పార్టీ బీఅర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది కౌన్సిలర్లను ప్రలోభపెట్టేందుకు అనేక రకాలుగా ఆఫర్లు ఇస్తూ, కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చి, వాళ్ళని మానసిక వేదనకు గురిచేసిందన్నారు. మా వాళ్ళను డబ్బులు ఆఫర్ చేసి, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఆఫర్ చేసినా కూడా... నిజమైన గద్వాల బిడ్డలుగా, ఆత్మగౌరవం ఉన్నవాళ్లుగా, పౌరుషం ఉన్నవాళ్లుగా, తెలంగాణ బిడ్డలుగా, కేసీఆర్ సైనికులుగా 11 మంది బి.ఆర్.ఎస్ పార్టీ కౌన్సిలర్లు ధైర్యంగా ఇవాళ బి.ఆర్.ఎస్ పార్టీ పక్షాన నిలబడ్డారని కొనియాడారు

కౌన్సిల్‌లో మున్సిపల్ ప్రమాణ స్వీకారానికి వచ్చి గద్వాల్ ఎమ్మెల్యే అరాచకాలకు ఎదురుగా నిలబడి వీళ్లంతా కూడా ప్యానెల్ పెట్టి పోటీ చేశారన్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలకు మా బి.ఆర్.ఎస్ పార్టీ ఓట్లు మా పార్టీ ఓట్లు వాళ్ళే వేసుకొని ఆత్మగౌరవాన్ని ఇవాళ తెలంగాణ రాష్ట్రానికే చాటి చెప్పారని తెలిపారు.

అక్రమానికి లొంగమని, అన్యాయానికి లొంగమని, డబ్బు మూటలకు లొంగమని, పదవుల ఆశకు లొంగమని చెప్పి 11 మంది బి.ఆర్.ఎస్ కౌన్సిలర్లు తెలంగాణ రాష్ట్రానికి సందేశం ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టుగా, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి చెంపపెట్టుగా ఇవాళ బీఅర్ఎస్ కౌన్సిలర్లు చైతన్యాన్ని ప్రదర్శించారన్నారు.

ఈ సందర్భంగా ఈ 11 మందిని కూడా బి.ఆర్.ఎస్ పార్టీ పక్షాన మనస్పూర్తిగా వీళ్ళందరినీ కూడా అభినందిస్తా ఉన్నాం. రాబోయే రోజుల్లో ఈ 11 మంది బి.ఆర్.ఎస్ పార్టీ కౌన్సిలర్లు గద్వాల గుండె స్పందనగా ఉంటారని, గద్వాల ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసి కొత్త చరిత్రకు నాంది పలుకుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.. ఎమ్మెల్యేను అధికార పార్టీని కూడా ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నట్లు తెలిపారు." గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఅర్ఎస్ పార్టీ జారీ చేసిన విఫ్ ఆదేశాలను పాటించకుండా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారని ఆరోపించారు.

బీఎర్ఎస్ పార్టీనుంచి గెలుపొందిన గద్వాల ఎమ్మెల్యే పై సుప్రీంకోర్టులో ఉన్న డిస్క్వాలిఫికేషన్ పిటిషన్‌కు ఈ ఆధారాలను కూడా జత చేయనున్నట్లు వారు తెలిపారు. రానున్న రోజుల్లో బీఅర్ఎస్ పార్టీ బలోపేతం చేస్తూ కార్య కర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, సూర్యగౌడ్, భరత్ సింహ్మరెడ్డి, నూతన కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



## జనగామ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా

### ప్రిసైడింగ్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారి గోపీరామ్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

జనగామ మున్సిపాలిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారణ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలక వర్గ సభ్యులచే జనగామ ప్రిసైడింగ్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారి గోపీరామ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముందు గా ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఎన్నికల్లో గెలు పొందిన సభ్యులచే ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా, మున్సిపాలిటీకి సంబంధించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణకి అనుకూల పరిస్థితులు లేకపోవడంతో ప్రిసైడింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి గోపీరామ్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

**వాయిదా పడిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేడు నిర్వహణ: ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో గోపిరామ్**

జనగామ మున్సిపాలిటీకి సంబంధించి నేటికి వాయిదా పడిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 12:30గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి వార్డు సభ్యులందరితో పాటు, నమోదు చేసుకున్న ఎక్స్ ఆఫీషియో సభ్యులు కూడా తప్పకుండా హాజరు కావాలని ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో గోపీరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న బసవేశ్వర్

## షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్‌గా అగ్గనూరు బసవేశ్వర్

**షాద్ నగర్, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం)**

షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ గా అగ్గనూరు బసవేశ్వర్ ను కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. సోమవారం అగ్గనూరు బసవేశ్వర్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అగ్గనూరు బస్వం ను సన్మానించి శుభాకాంక్షలు తెలియ చేశారు. ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ చైర్మన్ వైస్ చైర్మన్ పదవులకు పోటీ నెలకొనడం, రాజకీయ క్యాంపు నిర్వహించడం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, పార్టీ అధిష్టానం కలుగజేసుకొని సర్ది చెప్పడంతో అగ్గనూరు బస్వం చైర్మన్ ఎంపిక ఖరారయ్యింది. చైర్మన్ అగ్గనూరు బస్వంతో పాటు వైస్ చైర్మన్, గెలుపొందిన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు.


## జనగామ మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో నిషేధాజ్ఞలు

### వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**



జనగామ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక నేపథ్యంలో జనగామ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్యాలయ పరిసరాల్లో నిషేధాజ్ఞలు విధిస్తూ పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మున్సిపల్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు ప్రకటించారు. నేటి ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం 6 గంటల వరకు ఈ ఆజ్ఞ అమలులో ఉంటుందని, ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమి గూడటం నేరమని, నిషేదాజ్ఞలు ఉల్లంగించిన వారి పై చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతదని హెచ్చరించారు. ప్రజలు ఇది గమనించి పోలీసులకు సహ కరించాలని సూచించారు.



చైర్మన్ గా తాటికొండ వినయ్ కుమార్



వైస్ చైర్మన్ నీల రాజమ్మ

## స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా తాటికొండ వినయ్ కుమార్

### వైస్ చైర్మన్‌గా నీల రాజమ్మ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కార్యాలయాల్లో సోమవారం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గ సభ్యులచే స్టేషన్ఘన్పూర్ ప్రిసైడింగ్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారి డిఎస్ వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా ఉదయం 11 గంటలకు..మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులచే ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించగా... స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కి సంబందించి చైర్మన్ గా తాటికొండ వినయ్ కుమార్ ను గుర్రం హరినాథ్ ప్రతిపాదించగా బొల్లు లక్ష్మి బలపరిచారు. అలాగే వైస్ చైర్మన్ గా నీల రాజమ్మ ను పొన్న రవి ప్రతిపాదించగా అంగడి రజిత బలపరిచారు ఈ ఇద్దరిని ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం మెజార్టీ సభ్యులు ఎన్నుకున్నారు.అనంతరం వారిని చైర్మన్ , వైస్ చైర్పర్సన్ గా స్టేషన్ఘన్పూర్ ప్రిసైడింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి డిఎస్ వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించి, సంబంధిత ధ్రువపత్రాలను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్,తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల మున్సిపాలిటీ హస్తగతం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం)**

గద్వాల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన జయలక్ష్మీకి మిగతా వార్డు సభ్యులు మద్దతు తెలపడంతో గద్వాల్ మున్సిపాలిటిపై కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. సోమవారం ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు గద్వాల మున్సిపాలిటీలోని 37 మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా బీజేపీ కౌన్సిలర్ లు సమావేశాన్ని బహిష్కరించడంతో ఇతర పార్టీల కౌన్సిలర్ కు ఎవరు పోటికి రాకపోవడంతో చైర్మ పర్సన్ గా తుమ్మల జయలక్ష్మీ, వైస్ చైర్మన్‌గా శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. గద్వాల మున్సిపాలిటిలో మొత్తం 37 వార్డులకు గాను కాంగ్రెస్ 16 స్థానాలు, బీఅర్ఎస్ 11, బీజేపీ 7, స్వతంత్రులు 2, ఎంఐఎం 1 స్థానంలో గెలుపొందింది. చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి ఏ పార్టీకి కావలసినంత మ్యాజిక్ ఫిగర్ సంఖ్యా బలం 19 స్థానాలు దక్కలేదు. దీంతో గద్వాల మున్సిపాలిటిపై జెండా ఎగుర వేసేది అనేది గత రెండు రోజులుగా హాట్ టాఫిక్ గా మారింది. అప్పటికే కాంగ్రెస్, బీఅర్ఎస్, బీజేపీ పార్టీలు క్యాంపురాజకీయాలు కొనసాగించాయి. సోమవారం మున్సిపల్ చైర్మన్ఎన్నిక సందర్భంగా క్యాంపు తరలివెళ్లినవారు నేరుగా గద్వాల మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్ ల ప్రమాణస్వీకారం అనంతరం నిర్వహించిన చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 33వ వార్డు కౌన్సిలర్ కు కాంగ్రెస్ వార్డు మెంబర్లు మరో ఇద్దరు స్వతంత్రులు,ఒక ఏఐఎంఐఎం అభ్యర్థి మద్దతు పలికారు. వీరికి తోడు ఎన్నికల నిబంధనల మేరకు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లి రవి ఎక్స్అఫిసియో ద్వారా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ 20 చేరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ 33,వ వార్డు అభ్యర్థి తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్ చైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌గా గంజిపేట శంకర్ ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. బీఅర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గద్వాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికలలో తన ఓటు హక్కును వినియోగించుకోలేదు.



**కౌన్సిల్ నుంచి బీజేపీ వాకౌట్**

గద్వాల మున్సిపల్ నూతన చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ 16 స్థానాలు, బీఅర్ఎస్ 11, బీజేపీ 7, స్వతంత్రులు 2, ఎంఐఎం 1 స్థానాలలో గెలుపొందాయి. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో చైర్మన్ కు ఎన్నుకోవడానికి మెజార్టీ 19 సీట్లు లేకపోవడంతో బీజేపీ సమావేశం నుంచి బయటకు వచ్చారు. దీంతో మున్సిపల్ చైర్మన్ఎన్నిక లాంచనమే. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థికి మొత్తం 20 వార్డు సభ్యులు మద్దతు తెలపడంతో కాంగ్రెస్ అభ్యర్థి గద్వాల్ మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మీ ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు.

క్యాంపు రాజకీయాల నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి గద్వాల మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లభించలేదు. గద్వాల మున్సిపాలిటిలో మొత్తం 37 వార్డులకు గాను కాంగ్రెస్ 16 స్థానాలు, బీఅర్ఎస్ 11, బీజేపీ 7, స్వతంత్రులు 2, ఎంఐఎం 1 స్థానాలలో గెలుపొందాయి. గద్వాల్ లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో పలు పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరతీశాయి. కౌంటింగ్ కేంద్రాల నుంచి గెలుపొందిన అభ్యర్థు లను రహస్య ప్రాంతాలకు తరలించాయి. మున్సిపాలిటీ ఛైర్మన్ పీఠమే లక్ష్యంగా పావులు కదిపారు. ప్రత్యర్థులకు చిన్న అవకాశం కూడా ఇవ్వకూడదనే ఉద్దేశంతో ముఖ్య నాయకులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థులు ప్రత్యర్థి పార్టీల బేరసారాలకు లొంగకుండా, తమ ఆధీనంలో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. క్యాంపులు ఏర్పాటు చేసి సంఖ్యా బలాన్ని కాపాడుకునే వ్యూహాన్ని రచించాయి. బీఅర్ఎస్ నుంచి గెలుపొందిన సభ్యులను చేజారకుండా బీఆర్ఎస్ జాగ్రత్తలు తీసుకుంది. అధికార కాంగ్రెస్ నుంచి ఒత్తిళ్లు, ప్రలోభాలు ఎదురయ్యే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారు చేజారకుండా చూడాలని నేతలకు బీఆర్ ఎస్ అధినాయకత్వం స్పష్టం చేయడంతో బీఅర్ఎస్ నాయకులు అప్రమత్తమయ్యారు. గద్వాల్ లో హంగ్ ఏర్పడటంతో చైర్మన్ ఎన్నికకు కీలకంగా మారిన ఇద్దరు స్వతంత్ర వార్డు సభ్యులను ఎంఐఎం సభ్యులను కాంగ్రెస్ పార్టీ క్యాంపు లకు తరలించింది. సోమవారం వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం నేపథ్య ంలో వార్డు సభ్యులను ప్రత్యేక వాహనాలల్లో గద్వాల మున్సిపల్ కార్యాలయానికి తీసుకవచ్చారు. అంతిమంగా ఇండిపెండెంట్ కౌన్సిలర్ లు కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థికి మద్దతు తెలపడంతో గద్వాల మున్సిపల్ ఫీఠం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను బహిష్కరించిన బీజేపీ కౌన్సిలర్లు

**ఓటింగ్ కు దూరంగా ఉన్నా గద్వాల ఎమ్మెల్యే బండ్ల**

మొదటి నుండి బి ఆర్ ఎస్ పార్టీ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మొహన్ రెడ్డి పై విప్ అధికారం తో ఇబ్బందులకు గురిచేయాలనీ ప్రయత్నం చేయగా ఆయన అత్యంత వ్యూహం తో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలకు దూరంగా వుండి తన ఎక్స్ ఆఫీసీయో ఓటు ను వినియోగించుకోలేదు.



మున్సిపల్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన ముస్త్యాల అరుణ - బాలనర్సయ్య



వైస్ చైర్మన్ గా ఎన్నికైన ఉమ శ్రీధర్

## చేర్యాల మున్సిపాలిటీ బిఆర్ఎస్ ఖాతాలోకి

### చేర్యాల మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ముస్త్యాల అరుణ బాలనర్సయ్య

### వైస్ చైర్మన్‌గా మెడిశెట్టి ఉమ శ్రీధర్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని జనగామ నియోజకవర్గం,, చేర్యాల మున్సిపాలిటీ పీఠం బీఆర్ఎస్ ఖాతాలోకి చేరింది. మొత్తం 12 మంది వార్డు కౌన్సిలర్లు సోమవారం ప్రమాణస్వీకారం చేరారు. బిఆర్ఎస్ పార్టీ 7 గురు, కాంగ్రెస్ పార్టీ 5 గురు గెలుపొందిన విషయం తెలిసిందే. బిఆర్ఎస్ పార్టీ మెజారిటీ సాధించిన నేపథ్యంలో మున్సిపాలిటీ ఎస్సీ మహిళా రిజర్వేషన్ కావడంతో 6వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన ముస్త్యాల అరుణ బాలనర్సయ్య చైర్‌పర్సన్‌గా, 10వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన మెడిశెట్టి ఉమ శ్రీధర్ వైస్ చైర్మన్ లుగా బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు చైర్మన్, వైస్ చైర్మన్ లుగా ప్రమాణం స్వికారం చేశారు.

# నైతిక విజయం కాంగ్రెస్ పార్టీదే : నీలం మధు ముదిరాజ్





### బీఆర్ఎస్ ,బీజేపీ అనైతిక రాజకీయాలు

### మెడలు పట్టి గెంటేసిన పార్టీ కి ఎంపీ రఘునందన్ మద్దతు

### ఓటమితో కుంగిపోయేది లేదు

### కలిసికట్టుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాం

### పదమూడు మంది కౌన్సిలర్లకు కౌన్సిలర్లకు ఘన సన్మానం


**పటాన్ చెరు, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికలో నైతిక విజయం కాంగ్రెస్ పార్టీ దేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల చైర్మన్ ఎన్నిక అనంతరం ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు. బీసీ బిడ్డ ఎదుగుదలను ఓర్చుకోలేక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు కుమ్మక్కు రాజకీయాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. పొద్దున లేస్తే టీవీ ఛానల్లో బీఆర్ఎస్ పై హరీష్ రావు పై ఆరోపణలు చేసే దొర ఎంపి రఘునందన్ రావు మళ్ళీ ఆ దొర కాళ్ళ దగ్గర బానిసగా మారిపోయాడని విమర్శించారు. దీన్నిబట్టి చూస్తే ఎంపీ ఎన్నికల్లో హరీష్ రావు, రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అనైతిక బంధం నేడు బట్టబయలు అయిందని తెలిపారు. ఎంపీ రఘునందన్ మెడలు పట్టి బయటకు గెంటేసిన పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఎక్స్ అఫిషియో ఓటు వేయడం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఓటమితో కలత చెంది కుంగిపోయే మనస్తత్వం తనది కాదని మళ్లీ ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ అభివృద్ధి కోసం కష్టపడతామని స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. చైర్మన్ సీటు చేజారినంత మాత్రాన కార్యకర్తలు ఎవరు నిరుత్సాహ పడవద్దని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని ప్రభుత్వ సహకారంతో ప్రజలకు కావలసిన అభివృద్ధి కార్యక్రమాలను సాధించుకుందామని హితవు పలికారు.కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేసిన ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కౌన్సిలర్‌పై తప్పుడు మిస్సింగ్ కేసు నమోదు చేయడంపై పోలీసులు ప్రభు భక్తి చాటుకున్నారు



విలేకరులతో మాట్లాడుతున్న హాఫీజ్ ఫాతిమా



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

### జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

### ప్రజాస్వామ్య వ్యవస్థ పై దాడి

### నా కుటుంబం, నేను బిఆర్ఎస్ పార్టీతో క్షేమంగా ఉన్నాము కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

జనగామ మున్సిపాలిటిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనల పై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించు కునేందుకు వెళ్తుండగా జనగామ డీసీపీ బస్సును అడ్డగించి, తప్పుడు కిడ్నాప్ కేసు పేరుతో 28వ వార్డు కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమాని బలవంతంగా దింపి ఎలక్షన్స్ కుట్రపూరితంగా ఆపే ప్రయత్నం, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడిగా అభివ ర్ణించారు. హాఫీజ్ ఫాతిమా పోలీస్ లకి వీడియో రికార్డింగ్ ద్వారా, ప్రెస్ మీట్ ద్వారా తాను, నా కుటుంబం స్వచ్ఛందంగా, క్షేమంగా పార్టీ నాయకులతో ఉన్నానని, నన్ను గాని, నా కుటుంబ సభ్యులను గాని ఎవరు కిడ్నాప్ చేయలేదని స్పష్టం చేసినప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కేసులు నమోదు చేయడం దుర దృష్టకరమన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి అధికార దుర్వినియోగం జరిగిందని, ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, పోలీసులు అనవసరంగా లాఠీచార్జ్ చేయడం వల్ల పలువురు కార్యకర్తలు గాయపడటం తీవ్రంగా ఖండించారు. శాంతి యుతంగా ఉన్న ప్రజలపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపి, బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధు లకు తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హాఫీజ్ ఫాతిమా మాట్లాడుతూ నేను నా కుటుంబం బిఆర్ఎస్ పార్టీ తో క్షేమంగా ఉన్నామని కౌన్సిలర్ విలేకరులకు సోమవారం తెలిపింది. కుట్రపూరితంగా నన్ను బద్నామ్ చేయడానికి ఎవరు పిటిషన్ ఇచ్చారని వారికి నాకు ఎటువంటి సంబంధం లేదని ఈ సందర్భంగా తెలిపారు.

# ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో గౌడింగ్ లైట్ విగ్రహావిష్కరణ





**రాజేంద్రనగర్ (బండ్లగూడ), ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం)**

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ లో గైడింగ్ లైట్ విగ్రహ ఆవిష్కరణ , లాన్ టెన్నిస్ కోర్టు సోమవారం ప్రారంభించారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాంగణంలో గైడింగ్ లైట్ విగ్రహాన్ని సంస్థ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఆవిష్కరించారు. అనంతరం అకాడమీ లో ఏర్పాటు చేసిన నూతన లాన్ టెన్నిస్ కోర్టును కూడ ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... గైడింగ్ లైట్ విగ్రహం మహిళా గౌరవం, సాధికారత, ఆశ , న్యాయం పట్ల నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో అజ్ఞానం, అన్యాయం పై వెలుగు విజయం సాధిస్తుందనే సందేశాన్ని ఈ విగ్రహం అందిస్తుందని తెలిపారు.అకాడమీ లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ , క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు లాన్ టెన్నిస్ కోర్టు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్ అకాడమీలో వివిధ విభాగాలకు ఇంచార్జి లు గా ఉన్న రిజర్వ్ ఇన్స్పెక్టర్ ల కు స్పోర్ట్స్ కిట్ లు అందచేశారు.ఈ కార్యక్రమం లో వివిధ విభాగాల ఇంచార్జి లను వారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను,వారు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష బిస్త్ ఐపీఎస్, డిప్యూటీ డైరెక్టర్లు డి మురళీ ధర్ ఐ పి ఎస్,వెంకటేశ్వర్లు,జి కవిత, కె ఆర్ కె ప్రసాద్,శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటా వెంకట్రావ్,నాగేశ్వరరావు,శ్రీనివాసరెడ్డి,రమణ,భరత్, వి శ్రీనివాసరావు,నరహరి డాక్టర్ ధనజ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి , ఏవో యాదమ్మ , ఇండోర్ ,ఔట్డోర్ డి ఎస్ పి లు ఇన్స్పెక్టర్లు ఇతర ,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్‌గా మంజుల, వైస్ చైర్మన్‌గా సారమ్మలు

### వడ్డేపల్లి మున్సిపాలిటీపై ఎగిరిన ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ జెండా

**గద్వాల జిల్లా ప్రతినిధి (వడ్డేపల్లి), ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. ప్రధాన పార్టీలను వెనక్కినెట్టి, ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో మంజుల, సారమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర చరిత్రలోనే అరుదైన విజయం తెలంగాణ మున్సిపల్ రాజకీయాల్లో ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ ఒక మున్సిపాలిటీని గెలుచుకోవడం ఇదే ప్రథమం. మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు వ్యూహచతురతతో, ఆయన వర్గం 10 వార్డులకు గాను ఏకంగా 8 స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. ఈ విజయంతో వడ్డేపల్లి మున్సిపాలిటీ రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఎన్నికైన నూతన పాలకమండలి ఎన్నికల అధికారులు సోమవారం పాలక వర్గాన్ని ఎన్నుకుని, ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్ పర్సన్‌గా 4వ వార్డు కౌన్సిలర్ మంజుల, 2వ వార్డు కౌన్సిలర్ సారమ్మ అలియాస్ సారంద వైస్ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలోని పది వార్డుల్లో ల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ – 8, కాంగ్రెస్ – 1, బీఆర్ఎస్ – 1 కౌన్సిలర్‌గా విజయం సాధించారు. మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఏఐఎఫ్బీ అభ్యర్థులు ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. ఆకట్టుకున్న వ్యక్తిగత ఇమేజ్... పార్టీల కంటే వ్యక్తిగత ఇమేజ్, అభివృద్ధిపై నమ్మకంతో ప్రజలు వడ్డేపల్లి శ్రీనివాసులు వర్గానికి పట్టం కట్టారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ, వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# పోలీసులపై దురుసుగా ప్రవర్ధించి ఫోన్, ట్యాబ్‌ను ధ్వంసం చేసిన

### తల్లి కూతుళ్లపై కేసు నమోదు

**బుద్వేల్ , ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) :**

పోలీసుల పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండ సెల్ ఫోన్ను, ట్యాబ్ ను ధంసం చేసిన సంఘటన లో తల్లి కూతుళ్ల పై ఎనిమిది సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసిన సంఘటన ఇది. రాజేంద్రనగర్ ఇన్ స్పెక్టర్ ముత్తు యాదవ్, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నారు శీ... ఆదివారం మద్యాహ్నం బుద్వేల్ కు చెందిన మేరీ తమ ఇంటికి ఆనుకుని పక్కింటి కి చెందిన సంగీత ఇంటి స్లాబ్ వేస్తున్నారని, పోలీసులు వచ్చి తమకు న్యాయం చేయాలని 100 కు డయల్ చేసింది. పోలీసులు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. స్పందించిన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సుదర్శన్, మాధవి లు సంఘటన స్థలానికి చేరుకుని మేరీ ఇంటిపైకి వెళ్లి పక్కింటి వాళ్లు స్లాబ్ వేస్తుండటాన్ని పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో మేరీ ఆమె కూతురు చిన్ని లు బిందె తో స్లాబ్ వేస్తున్న పక్కింటి నిర్మాణం పై నీళ్లు పోస్తున్నారు. దాన్ని మొదట గా కానిస్టేబుల్ సుదర్శన్ తన ఫోన్ లో చిత్రీకరిస్తుండగా మేర్, చిన్ని లు కానిస్టేబుల్ ఫోన్ ను లాక్కొని పగులగొట్టారు. ఆ తర్వాత ఆయన ట్యాబ్ లో అక్కడ జరుగుతున్న సన్నివేశాలను చిత్రీకరిస్తుండటంలో ట్యాబ్ ను కూడా ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన కానిస్టేబుల్ తో పాటు మహిళా కానిస్టేబుల్ పై దురుసుగా ప్రవర్థించారు. ఈ సంఘటన లో కానిస్టేబుళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరీ, ఆమె కుమార్తె చిన్ని లపై రాజేంద్రనగర్ పోలీసులు 221 132, 74, 351(2), 352, 324(4) రెడ్ విత్ 3,5 బీఎన్ఎస్. 3పీడీపీపీఎ సెక్షన్ ల ప్రకారం కేసు లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# శివ భక్తులకు దాహార్తిని తీర్చిన తిక్కిరెడ్డి కుటుంబ సభ్యులు

**పటాన్ చెరు, ఫిబ్రవరి 16, (ప్రభాత ఉదయం):**



మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని బీరంగూడ శ్రీ మల్లికార్జున స్వామిగుడి దగ్గర శివ భక్తులకు దాహం తీర్చడం కోసం తిక్కిరెడ్డి కుటుంబ సభ్యులు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు ఎనిమిది వేల మందికి ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం తిక్కిరెడ్డి సూర్యనారాయణ, పాపాయమ్మ జ్ఞాపకార్థం నిర్వహించడం జరిగిందని , ఈ కార్యక్రమానికి సేవలు అందించిన పైడిభత్తులు వెంకటేశ్వరరావు, సోమేశ్వర్ ల సహకారం మరువలేనిదని తిక్కిరెడ్డి విష్ణుమూర్తి కుటుంబ సభ్యులు తెలిపారు.